# ప్రజల మాట ప్రగతి బాట

## సికింద్రాబాద్ నియోజకవర్గం



అన్నదానం చేస్తున్న ఆలయ నిర్వాహకులు

## చండీ హోమాలు..అన్నదానాలు

సికింద్రాబాద్, అక్టోబర్ 22: మేడిబావిలోని పోచమ్మ ముత్యాలమ్మ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఎనిమిదో రోజు ఆదివారం ఘనంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు భక్తులకు దుర్గా దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పరికిబండ కళాప్రకాశ్, మోహన్, సంజీవ్,కొండల్ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

**బీదలబస్తీలో......**

బీదలబస్తీలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో చండీ హోమం నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.ఈసందర్భంగా భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు మల్లేష్,గడ్డంప్రసాద్,శేషగిరి రావు,బాల్‌రాజ్‌గౌడ్,విద్యాసాగర్,బబ్బీ,దయా,శ్రీను,వివేక్‌లు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



మేడిబావిలోని పోచమ్మ ముత్యాలమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు



మేడిబావి రేణుకా ఎల్లమ్మ ఆలయంలో చండీ యాగంలో పాల్గొన్న భక్తులు



నార్త్ లాలాగూడలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పొన్నాల రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ పూజలో నగర గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, పార్టీశ్రేణులు నక్కమధు, శ్రీనివాస్ గౌడ్, అమర్, శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. – అడ్డగుట్ట, అక్టోబర్ 22



దుర్గాదేవీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారు





**బతుకమ్మ సంబురాలు:** లాల్‌బజార్ శ్రీ మహంకాళీ దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకలకు మహిళలతో కలిసి బతుకమ్మను తీసుకొస్తున్న బోర్డు మాజీ సభ్యురాలు భాగ్యశ్రీ, బొల్లారంలో బతుకమ్మలు ఆడుతున్న మహిళలు.– బొల్లారం, అక్టోబర్ 22



బంజారాహిల్స్‌లోని రోడ్డు నంబర్ 12లో బతుకమ్మ ఆడుతున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు



గౌరమ్మకు మొక్కుతున్న చిన్నారి



సికింద్రాబాద్‌లోని కుద్బుల్లా మైదానంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, విదేశీయులు



బతుకమ్మ ఆడిన అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేయడానికి తీసుకెళ్తున్న మహిళలు



బంజారాహిల్స్‌లోని బీజేఆర్‌నగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

## వాల్యాకు ఓయూ డాక్టరేట్



ప్రొఫెసర్ లింబాద్రికి పరిశోధనా గ్రంథాన్ని అందజేస్తున్న వాల్యా

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 22: ఉస్మానియా యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఎం. వాల్యా డాక్టరేట్ సాధించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి పర్యవేక్షణలో 'ట్రైబల్ డెవలప్‌మెంట్ సబ్‌ప్లాన్ స్కీమ్స్ ఇన్ తెలంగాణ స్టేట్: ఎ స్టడీ ఆఫ్ మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్' అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి వాల్యా సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచి అధికారులు ఆయనకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్టు ఒక ప్రకటన విడుదల చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం చిట్టిబోయినపల్లి గ్రామంలోని నిరుపేద గిరిజన కుటుంబంలో జన్మించారు. ప్రస్తుతం ఆయన ఇఫ్లూలో ఉద్యోగం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధ్యాపకులు, అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

## గల్ఫ్ కార్మికుల కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జయ వింధ్యాల

హిమాయత్‌నగర్,అక్టోబర్ 22: గల్ఫ్ దేశాల్లో తెలంగాణకు చెందిన 15 లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారని,వీరి సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని సిటిజన్ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ జయ వింధ్యాల,కో కన్వీనర్లు రామ్ చల్ల, గడ్డం అశోక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బతుకు దెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన కార్మికులు పరాయిదేశంలో అనారోగ్యం,పని ఒత్తిడి,రోడ్డు ప్రమాదాలు,వేతనం వంటి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గల్ఫ్ దేశంలో ఉన్న కార్మికులు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.పార్లమెంట్‌లో ఆమోదం పొందిన 33 శాతం మహిళ రిజర్వేషన్‌ను తక్షణమే అమలు చేసి అన్ని రాజకీయ పార్టీలు అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు అధిక సీట్లు కేటాయించాలని కోరారు. యువత రాజకీయాల్లోకి రావాలన్నారు.

## దళితులు తమ హక్కులు సాధించుకోవాలి



హిమాయత్‌నగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ స్వరూప్

హిమాయత్‌నగర్,అక్టోబర్22: బహుజనులకు సామాజిక న్యాయం,రక్షణ,ఆత్మ గౌరవం దక్కాలంటే ఐక్యమై పోరాటాలతో సాధించుకోవాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపు నిచ్చారు.ఆదివారం హిమాయత్‌నగర్‌లో పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనువాద పార్టీలను ఓడించి దళిత బహుజన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.ఈ సమావేశంలో పార్టీ నాయకులు డాక్టర్ వీఎల్‌రాజు, జెన్ రావు, శ్రీనివాస్, బీరం సతీష్‌కుమార్, శంకర్,సాంబయ్య,కరుణాకర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.